
పి.శేషవర్ధనరావు

# ప్రేమ

సిఎఫ్ఎఫ్‌పి ఇన్స్‌పెక్టర్
న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్,
హైదరాబాద్-500 76?.

ఎవరో పిలిచినట్లయి వెనక్కి తిరిగి చూశాడు అరవింద్. అంజిబాబు తన కేసి రావడం గమనించి ఆగాడు.

"బావున్నారా బావగారూ" అడుగుతూ పక్కనే నడుస్తూ అడిగాడు అంజిబాబు.



"ఆఁ ఏమిటి విశేషాలు"

"ఏమున్నాయి అంతా బాగానే ఉన్నారు. మొన్న అంజలి కనిపించింది"

ఒక్కసారిగా గాలి స్తంభించినట్లయింది. క్షణం ఆశ్చర్యం, మరుక్షణం మెరుపు కలగాపులగంతో కూడిన సంతోషంతో "ఎలావుంది. బావుందా!" అడిగాడు అరవింద్.

"ఆఁ. ఇద్దరు పాపలతో నడుస్తూ చంకలో మరో పాపతో అవస్థ పడుతూ కడుపులో ఇంకో పాపతో.. పక్కన ఆమె హజ్బెండనుకుంటా ఆయనతో కన్పించింది. వాడూ వాడి దర్జా పాడుగాను... థూ" తుపుక్కున వూశాడు.

"అంజీ" మందలించాడు అరవింద్.

"నాకు చాలా కోపం వచ్చింది బావగారూ, 'చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవా' అని వూరికే అన్నారా! అయినా వాణ్ణి ప్రేమించే పెళ్ళి చేసుకుందట, బ్రతుకు తక్కువ బడాయి ఎక్కువ అన్నట్లున్నాడు వాడు! వాడూ వాడి సఫారి డ్రెస్సు! వాడికన్నా.. మా కాలనీలో పాత ఇనుప సామాన్లు కొనే వాడు నయం... నీట్‌గా ఉంటాడు"

"అంజీ.." కోపంగా అన్నాడు అరవింద్.

"లీవిట్" అని తనను తాను సంబాళించుకుని మామూలుగా అవటానికి ప్రయత్నిస్తు "అది తప్ప ఇంకేదయినా మాట్లాడు అంజీ" అన్నాడు.

అరవింద్ కళ్ళల్లోకి చూస్తూ " ఇప్పుడు నీ మనసేం బావుండలేదనుకుంటాను. మరోసారి కలుద్దాంలే వస్తాను" అంటూ వెళ్ళబోయాడు అంజిబాబు.

వెళ్ళబోతున్న అంజిని పిలిచాడు అరవింద్... అంజలిని గురించి తెలుసుకోవాలన్న యాంగ్జయిటీతో.

ఆమె యోగ క్షేమాలను గురించి అడిగి తెలుసుకోవాలన్న తపన. కానీ అతడు మాట్లాడే విధానం తనకు నచ్చకున్నా తన మనసును చివుక్కు మనిపిస్తోన్నా భరించక తప్పదనుకున్నాడు అరవింద్.

"అంజలితో మాట్లాడావా?" ఆసక్తిగా అడిగాడు.

"మాట్లాడాలనే ఉద్దేశ్యంతోనే గబగబ ఆమెకెదురు వెళ్ళి 'బాగున్నావా అంజలీ' అన్నాను"

"ఏమంది"

"నేనెవర్నో తనకు తెలీనట్లే బిహేవ్ చేసింది. ఎంత నాటకం!"

"గుర్తుపట్టలేదేమో"

"లేదు, నేనీ అయిదేళ్ళల్లో గుర్తుపట్టలేనంతగా మారానంటే ఒప్పుకోను. నా వేషంలో గానీ రూపంలో గానీ అప్పటికీ ఇప్పటికీ ఏమన్నా మార్పుందా చెప్పు. అప్పుడెలా ఉన్నానో ఇప్పుడూ అలానే ఉన్నాను. ముసలాణ్ణయినా అలాగే ఉంటాను. నాబాడీ ప్రకృతే అంత. అవునా కాదా నువు చెప్పు బావా"

"అవును" ఒప్పుకున్నాడు అరవింద్.

"మరి మీ ఇద్దరి మధ్య ఉత్తరాలు మోసిన వాణ్ణి నన్ను అన్నయ్యా అని పిలిచిన ఆ అంజలి నన్ను గుర్తు పట్టి కూడా గుర్తులేనట్లే ప్రిటెండ్ చేసింది ఎందుకో తెలుసా? ఆమె పక్కన నడుస్తోన్న ఆమె భర్త.. నాక్లాస్ మేటే" అన్నాడు అంజిబాబు నవ్వుతూ.

'అంజలి నీకు తెలుసా?' వాడడిగాడు కూడా, 'బాగా తెలుసు' అన్నాను. ఆ మాటకి చిగురుటాకులా వణికి పోయిందనుకో. మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ 'నాకు తెలీదు' అంది సాగదీస్తూ. 'తెలీకపోతే పోనీండి' అన్నాను. వాడే నన్ను ఆమెకు పరిచయం చేశాడు.

వింటూనే ఫక్కుమన్నాడు అరవింద్.

'హమ్మయ్య, నీకు మనసు బాగోలేదనుకున్నాను దార్లోకొచ్చావు బావా తర్వాతేం జరిగిందో తెలుసా?'

"నువు చెప్పండే.."

'వస్తున్నా వస్తున్నా! నేను వాళ్ళ నుండి దూరమయ్యేవరకు ఎదురుగానే ఉంది అంజలి" అని ఆగాడు. కాసేపయ్యాక మళ్ళీ తనే మొదలెట్టాడు.

"ఉండదా మరి. ఆమె కోరికలూ, కన్న కలలూ, మనసులో నిలిచిపోయిన ఆశాసౌధాల్లాంటి గాలిమేడలూ మట్టి కొట్టుకుపోయాయి. నీతో ఏడడుగులునడిచి, నీతో ఎన్నో సాయం సమయాలు గడిపి నిన్ను అవతలికి విసిరేసింది. మనసా వాచా నువ్వు ఆమెను నమ్ముకున్నావు. పిచ్చిగా ఆరాధించావు ఏమైంది? ఒక కారు బంగళా, డబ్బూ ఉంటే చాలు అదే జీవితం అనుకుందామె."

అరవింద్ ఆలోచనలు వేరు. అతని దృక్పథం వేరు. ఎప్పుడూ ముభావంగా ఉండే తత్వం.

మధ్య తరగతి కుటుంబంలో అరవింద్ పెద్దవాడు, స్కూలు ఫైనల్ చదువు, డిప్లొమా సర్టిఫికెట్‌తో ఉద్యోగం వేటలో పడ్డాడు. సరిగ్గా అప్పుడే ప్రవేశించింది అతని జీవితంలోకి అంజలి.

ప్రేమ ప్రేమ అని ముడిపెట్టుకు తిరగడంతో తనకున్న ఆదర్శాలూ, అభ్యుదయ భావాలతో అంజలినే నమ్ముకుని మడికట్టుక్కూర్చున్నాడు.

పెద్దవాళ్ళకు ఇష్టం లేకపోయినా తనకు ఉద్యోగం రాగానే పెద్దవాళ్ళను ఒప్పించడం పెద్ద సమస్య కాదనుకున్నాడు అరవింద్.

అంజలిని అరవింద్ కివ్వటానికి అంజలి తల్లి దండ్రులకు్కూడా అసలు ఇష్టంలేదు. వాళ్ళకంటే అరవింద్ కుటుంబం పెద్దది కావడం, పేదవాడు కావడం ముఖ్య కారణం. వీళ్ళ ప్రేమ విషయం తెలిసాక అరవింద్‌ను డైరెక్ట్‌గా పట్టుకుని..

"నీకేం ఉందని పిల్లనివ్వాలి. వాదిలేసిన ఆంబోతులా ఊరు మీదపడి తిరుగుతున్నావు. ఇల్లా వాకిలా? దొరక్క దొరక్క మాపిల్లే దొరికిందా నీకు?" అంటూ దులిపేసింది అంజలి తల్లి అనసూయమ్మ.

అయినా అతని నిర్ణయం మారలేదు. ఆమె తనకు రాసే ఉత్తరాల్లో చివర 'మీక్కాబోయే భార్య అంజలి' అంటూ ముగించేది. ఇది అరవింద్‌ను బాగా ఆకట్టుకుంది. తన పట్ల ఆమె చూపే ఆరాధనే అతణ్ణి ముగ్ధుణ్ణి చేసింది.

గలగల పారే సెలయేటిలా జలజలరాలే జలపాతంలా ఉండేదామె. సాయంత్ర సమయాల్లో చేల గట్లెంబడి చెట్టపట్టా లేసుకు తిరగడంతో ఫలానా అంజలి ఫలానా అరవింద్‌ల ప్రేమ ముదిరి పాకాన పడిందని ఊరు ఊరంతా గుప్పుమంది.

అంజలి స్వభావం చంచలమైంది. అరవింద్ కంటే గొప్పవాడూ, అందగాడూ కనిపిస్తే ఆమె తన మనసును అటువైపు పారేసుకునే తత్వం. ఇక్కడ సరిగ్గా అదే జరిగింది.

ఆ ఊళ్ళోకెల్లా ధనవంతుడూ, అందగాడైన అభిషేక్ పరిచయమయ్యే సరికి ఆమె రూటు అటువైపు మారింది. అభిషేక్ ఆమెను సరదాగా తనవెంట తిప్పుకున్నన్నాళ్ళూ తిప్పుకుని పక్కకు జరిగాడు.


ప్రేమ మైకంలో పడి పూర్తిగా దెబ్బతింది అరవిందే. ఓ రకంగా దేవదాసయిపోయాడు. అంజలి మనసు మార్చుకుని తనను ఇష్టపడితే పెళ్ళి చేసుకోవాలని తపించాడు. ఆమె కోసం ఎదురు చూశాడు. తనవైపు తిప్పుకోవాలని ప్రయత్నించాడు.

అనసూయమ్మలానే అంజలి కూడా అవమానించే సరికి అతని అహం దెబ్బతింది. తనకు లేనిది, వాళ్ళకు ఉన్నదేమిటో చూపించి తీరాలని పట్టుదలతో దేవదాసు పాత్రకు తిలోదకాలిచ్చాడు.

ఒకప్రైవేటు ఇనిస్టిట్యూట్‌లో ఇన్‌స్ట్రక్టర్‌గా చేరాడు. తన మనోఫలకం నుండి అంజలిని తప్పించేసి మైండ్‌ను బ్లాంక్‌గా ఉంచుకున్నాడు.

'కులమతాలకు వరకట్నాలకు స్వస్తి' అనే నినాదంతో వివాహవేదిక శీర్షికన పత్రికలలో ప్రకటన ఇచ్చాడు. ఆ ప్రకటన వల్ల అసంఖ్యాకంగా ఉత్తరాలు వచ్చాయి.

'మీ కులమేమిటో తెలియజేస్తే పిల్లనిస్తాం 'అనో..' మీరు కట్నం ఎందుకు వద్దంటున్నార'నో... ఇలా రకరకాల అనుమానాలను వ్యక్తం చేస్తూ వస్తోన్న ఉత్తరాలని చూస్తూంటే అరవింద్‌కి పిచ్చెక్కి పోయింది.



## ఊటీలో రాజా



కొంతమందికి కొన్ని కొన్ని అనుకోకుండా కలిసొస్తుంటాయి.

దర్శకుడు ఇంద్ర కుమార్ రూపొందించిన దిల్, బేటా చిత్రాలు సూపర్ హిట్టయ్యాయి. ఈ రెండు చిత్రాల్లో కొంత భాగం ఊటీలో చిత్రీకరించాడు. అందులోనూ ఒక చెట్టు దగ్గర సీన్‌లు రెండు చిత్రాల్లోనూ ఉన్నాయి.

ఆ సెంటిమెంట్‌తోనే ఇప్పుడు తన కొత్త చిత్రం 'రాజా'లో కూడా ఆ చెట్టు దగ్గర సీన్ తీశాట్ట.

'రాజా'లో సంజయ్‌కపూర్, మాధురీ దీక్షిత్ జంటగా నటిస్తున్నారు.

-మౌర్య.

ఒక మంచిపని చేద్దామనుకుంటే సమాజం తననిలా అర్థం చేసుకుందని వాపోయాడు. కొన్నాళ్ళు పోయాక తల్లిదండ్రుల ఇష్టంతో వాళ్ళు చూసిన సంబంధాన్నే చేసుకోడానికి నిర్ణయించుకుని ఆరోజే వాళ్ళతో ఆ విషయం చెప్పాడు అరవింద్.

ఆ ఇంటికి అర్చన కోడలిగా వచ్చిన వేళా విశేషం కావచ్చు... అరవింద్‌కు గవర్నమెంట్ జాబు రావడం, జాయినవడం వెన్వెంటనే జరిగిపోయాయి!

"ఏమండీ.. ఏమండోయ్ టీ తెచ్చాను" అర్చన అరుపులకు గతం నుండి తేరుకుని అర్చన చేతిలోంచి టీకప్పును అందుకున్నాడు అరవింద్.

"ఏమిటాలోచిస్తున్నారు?"

"ఏమీ లేదు అర్చనా" అంటూ టీ కప్పును పక్కన పెట్టి లేస్తూ "స్నానం చేసి వస్తాను" అంటూ లేచాడు.

స్నానం చేస్తూ బాత్ రూంలో మళ్ళీ గతంలోకి వెళ్ళిపోయాడు.

ఆదర్శాలకు పోయి అంజలినే చేసుకుంటే తన లైఫ్ ఎలావుండేది.

మళ్ళీ అంజలి తలపులు గుర్తొచ్చేసరికి అంజలి తనతో ఆనాడు చేసిన బాసలు, విహారాలు అన్నీ గుర్తొచ్చాయి.

ఒక రకంగా అంజలి వాళ్ళమ్మా,అంజలీ తనను అవమానించి, తృణీకరించి మేలే చేశారు.

తను జాబు చేస్తూనే ప్రైవేటుగా బిటెక్ పూర్తిచేసి, మేనేజర్ హోదాలో బాధ్యత గల ఆఫీసరుగా గవర్నమెంట్ వారిచ్చిన కారూ, బంగళా సౌకర్యాలతో తనకు అనుకూలవతి అయిన భార్య అర్చనతో తనెంతో సుఖంగా ఉన్నాడు.

అంజిబాబు కనిపించి అంజలి గురించి చెప్పిన దగ్గర్నుంచీ ఆమె దయనీయ పరిస్థితిని తనే స్వయంగా చూసినట్లు ఫీలయ్యాడు అరవింద్.

ఒకరోజు హాల్లో పేపరు చదువుతూ కూర్చున్నాడు అరవింద్.

"అరవింద్ బాబూ" పిలుపు వినిపిస్తూనే తలెత్తి చూశాడు.

అంజలి!

సాదా చీరతో సింపుల్‌గా ఉన్నా ఆమె కట్టుకున్న తీరుచూస్తుంటే చీరకే అందాన్ని తెచ్చిపెట్టినట్లయింది. తనను తాను నమ్మలేకపోయాడు. ఆశ్చర్యం నుంచి తేరుకోగానే అడిగాడు "ఏమిటిలా వచ్చావు?"

తన చేతిలో నున్న కవరును అందించింది అంజలి. అది తను పనిచేస్తోన్న ఆఫీసు నుండి వచ్చిన అటెండరు పోస్టుకు ఇంటర్వ్యూ కాల్ లెటర్.

"ఇతడు నాభర్త. ఈ ఉద్యోగం వస్తే మీరు మాకింత అన్నంపెట్టిన వారవుతారు" అంది.

"ష్యూర్"

"థాంక్స్ అరవింద్ బాబూ గతాన్ని గుర్తుంచుకుని మీరు నాకు సహాయం చెయ్యరేమోనని చాలా భయపడ్డాను. కన్నీటితో వేడుకుందామని వచ్చాను. మీ ఋణం ఎలా తీర్చుకోను!"

"అంతంత మాటలెందుకు అంజలీ. ఇది నాచేతిలో పని కాబట్టి మీ వారికి జాబ్ వేయిస్తాను సరేనా! మీ వాళ్ళెలా ఉన్నారు"

"మా నాన్న పోయి మూడేళ్ళయింది. ఉన్న కాస్త పొలాన్ని అమ్మి అన్నయ్య వేరే వెళ్ళిపోయాడు. అమ్మ నా దగ్గరే ఉంది. ఆమెకిప్పుడు కనిపించదు. చూపు పూర్తిగా పోయింది. అందని వాటికోసం అర్రులు చాస్తే ఇలాగే అవుతుందేమో. ఆనాడు నేమనిమ్ము కాదని దూరపు కొండల కెగబడ్డాను..." అమె మాట్లాడ్తూనే ఉంది అంజిబాబు వచ్చాడు.

అంజలి అంజిబాబుని చూస్తూనే తొట్రుపడింది.

"నీకు నేనెవర్నో తెలీదన్నావు. కనీసం ఈయనైనా తెలిసినందుకు సంతోషం" అన్నాడు అంజిబాబు వ్యంగ్యంగా...

"ఓహో నువ్వీ ఉద్యోగం అంజలి భర్తకే ఇప్పిస్తున్నావన్నమాట" అరవింద్‌ను అడిగాడు మళ్ళీ.

"అవును"

"నీకు ఏమూలో కొంచెం ఏదో ఉంది బావా"

"ఏంటీ..."

"ప్రేమ అదే... అంజలి పట్ల.. నీకు ఏదో తెలీని ప్రేమ"

నవ్వాడు అరవింద్ "ప్రేమ ఉన్నా లేకపోయినా నాకు మానవత్వం ఉంది. నేనీనాడు ఇలా ఉన్నత స్థితిలో ఉన్నానంటే కారణం అంజలి తృణీకారమే! ఆమె ఆనాడు నన్ను తృణీకరించి ఉండకపోతే నేనీనాడు ఈ ఉద్యోగం చేసే స్థితిలో ఉండే వాణ్ణే కాదు! నేనిచ్చే ఈ ఉద్యోగం ఆమెకూ, ఆమె పిల్లలకు ఎంతో కొంత ఆసరా ఇస్తే నాకదే సంతోషం!"

అంజిబాబు ఎప్పుడు వెళ్ళాడో... ఆ విషయం గమనించకుండా మాట్లాడుతూనే ఉన్నాడు అరవింద్.

★